


# పాపం... ముకుందం!

వి.వి.ఎల్. సావిత్రి

**గేటుముందు ఆటో ఆగిన శబ్దానికి గార్డెన్‌లో మొక్కలకు నీళ్లు పోస్తున్న భజగోవిందం తడబడ్డాడు. ఎవరబ్బా వచ్చింది అనుకుంటుండగానే ఆ పక్కనే మొక్కల్లో ఆడుతున్న సుపుత్రిక మాలక్ష్మి ఒక్కదూకు దూకింది వచ్చినవారెవరో చూడటానికి. ఆ దెబ్బకి మొక్కలకు నీళ్లు పోస్తున్న ట్యూబు కాస్తా భజగోవిందం చేతిలోంచి జారి కిందపడి, ఆ ఊపుకి నీళ్లన్నీ మీద ఒలికిపోయాయి. ఆగవే... ఆగాగు... వెధవ పిల్లాని... మీ అమ్మలాగే నీకూ దూకుడెక్కువ.**

ఆ వచ్చిన వెధవ ఇంట్లోకి రాకుండానే వెళిపోతాడా? ఎంటా పరుగు? ఎపుడూ మనుషులని చూడనట్లు అంటూ లాగి ఒకటి వీపుమీద అంటించడంతో మా లక్ష్మి రాగాలాపన మొదలెట్టింది. ఆటోలోంచి దిగిన ముకుందానికి మిత్రుని గొంతులో, తిట్లలో, వ్యాఖ్యానాల్లో ఏ మాత్రం మార్పు రాలేదన్న విషయం అర్థమైంది. తడిసి పోయిన లుంగీ, కండువాతో ఎదురొచ్చిన భజగోవిందం ముకుందాన్ని చూడగానే రా..రా.. ఎప్పుడు బయలుదేరావ్? ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి.. అంటూఆప్యాయంగా పలకరించాడు. ఆటోవాడికివ్వడానికి చిల్లర లేక జేబులు తడుముకున్నాడు ముకుందం.

'ఏంట్రా చిల్లర లేదా? ఏంటి? అందుకే.. ప్రయాణాలపుడు చిల్లర దగ్గరుంచుకోవాలంటారు. నీకింకా కుర్రతనం పోలేదు.. ఎపుడు బాగుపడతావో ఏమో.. చిల్లర తేనా..'

'ఆ వద్దులే.. పదిహేడు రూపాయలయిందిగా .. మూడు రూపాయలుంటే ఇవ్వుబాబూ.. ఆటోవాడ్ని అడిగాడు ముకుందం.

'చిల్లర లేదు సార్. పొద్దుగాల బేరం సార్., మూడురూపాయలకేమైంది. ఇచ్చేయండి సార్' అన్నాడు ఆటోవాడు. ముకుందం సరే అనేలోగానే భజగోవిందం ఒక్క దూకు దూకాడు. ఆగాగు. ఏంటది. మీటరు పదిహేడు రూపాయలు చూపిస్తోంది. ఇంకా మూడెందుకు ఎగస్ట్రా.. దండగ. ఊరి నుంచి జనం వచ్చారంటే చాలు... ఇక దోచేయడం మొదలు అంటూ నానా యాగీ చేశాడు. మీటరుమీద పైసా కూడా ఎక్కువ ఇవ్వద్దన్నాడు. చివరికి ముకుందమే ఆటోవాడి జేబులో 20 నోటు కూరి వెళ్లిపోమని సైగ చేయడంతో ఆ రాద్ధాంతం ముగిసింది.

'నీకు బొత్తిగా డబ్బు విలువ తెలియటం లేదురా. బాధ్యతలు లేకపోతే అలాగే ఉంటుంది.. ' అంటూ లోపలికి తీసుకెళ్లాడు భజగోవిందం. మిత్రుని ఆలోచనా విధానం, మాటతీరు, చాదస్తం అప్పటికీ ఇప్పటికీ ఏమీ మారలేదనుకున్నాడు ముకుంధం మనసులో. ఆ మాటా , ఈమాటా అయ్యాక కాఫీ సేవనం దగ్గర భజగోవిందం కుశల ప్రశ్నలు మొదలెట్టాడు.

' చూశావా ఆరోజున నాతో పాటు బ్యాంకు పరీక్షలు రాయరా అంటే విన్నావా. నేను చూడు నీ ఎదురుగుండానే బ్యాంకు ఉద్యోగానికి సెలక్ట్ అయి ఇచ్చిన లోనుతో ఇల్లు కట్టుకుని పెళ్లిచేసుకుని ఇద్దరు పిల్లలతో సెటిల్ అయిపోయాను' అంటూ స్వోత్కర్ష మొదలెట్టాడు. భజగోవిందం చిన్నప్పటి నుంచి అంతే.. ప్రతీది కాలిక్యులేటివ్‌గా ఆలోచిస్తాడు. ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడడు. ఎందుకు అనవసరంగా ఎనర్జీ దండగ అనుకుంటాడు. పొదుపు పాటించడంలో మాత్రం అందరికన్నా ముందుంటాడు. ప్రతీది అనుమానంతో ఒకటికి. రెండుసార్లు పరీక్షించిగానీ నిర్ణయం తీసుకోడు. ప్రతీ విషయంలోనూ అతిజాగర్త. విపరీతమైన అనుమానం. అందుకే కాలేజీలో గోవిందాన్ని ఒక వింత జంతువును చూసినట్లు చూసేవారు. ప్రతీదానికీ లెక్కలు వేయడం భజగోవిందం అలవాటు. పొదుపుగా నవ్వుతాడు.. పొదుపుగా ఆలోచిస్తాడు.. పొదుపుగానే జీవితాన్ని వెళ్లదీస్తాడు. తీరిక వేళల్లో ఇంకా పొదుపుగా జీవితాన్ని ఎలా వెళ్లదీయవచ్చన్న అంశం మీద రిసెర్చ్ కూడా చేస్తుంటాడు. ఎవ్వరికీ రూపాయి అప్పివ్వడు.. ఎవరి దగ్గరా పైసా యాచించడు. సర్వకాల సర్వావస్థల యందూ తన జాగ్రత్తల్లో తానుంటాడు. అందుకే భజగోవిందం అంటే కాలేజీలో అందరికీ విచిత్రంగా ఉండేది.

అప్పటికీ. ఇప్పటికీ పెళ్లాం, పిల్లలు, ఉద్యోగం, సొంత ఇల్లు, ముక్కు మీద కళ్లజోడు, చిరు బొజ్జ తప్ప భజగోవిందంలో ఏ మార్పూలేదు అనుకున్నాడు ముకుందం మనసులో.

'ముకుందం! ఏంటీ మన ఊరు విశేషాలు? 'పాలకూరని కైమా కొట్టినట్టు చెక చెకా తరిగేస్తూ కబుర్లలోకి దించాడు భజగోవిందం.

' అబ్బో... భార్యకి సహాయపడే గుణమే.. ఫర్వాలేదు' అనుకున్నాడు ముకుందం.

'ఏముంది? అంతా క్షేమం... నేనిక్కడో చిన్నపాటి ఉద్యోగానికి ఇంటర్వ్యూకి అటెండ్ అవడానికి వచ్చాను. రేపే ఇంటర్వ్యూ... ఆకంపెనీ ఎక్కడో ఊరికి దూరంగా ఉందట. ఇదిగో వివరాలు అంటూ ఇంటర్వ్యూ కాల్ లెటర్ చూపాడు .'

కూరలు తరుగుతున్న భజగోవిందం ఒక్క ఉదుటున లేచి వచ్చి కాల్‌లెటర్‌ను అందిపుచ్చుకుని ఆసాంతం చదివాడు.

' ఓహ్. నీ జీవితానికి వచ్చిన ఆఖరి అవకాశం. దీన్ని వదులుకోకు. ఇంటర్వ్యూకి నేనే దగ్గరుండి మరీ తీసుకెడతాను. ఇలాంటి సాయానికేగా నువు మా ఇంటికొచ్చింది.ఏమంటావ్? సరేనా ? '

'ఫర్లేదు. గోవిందం... నే వెళ్లి రాగలను. నిన్ను కూడా చూసినట్టుంటుంది కదాని వచ్చానన్న మాట..'

' చాల్లే...ఊరుకో... నే లేనా ఏమిటి? నీకు ఈ వూరు కొత్త. ఇందాకే చూశావుగా ఆటోవాడి దబాయింపు.. నీకోసం రేపు నేను శెలవు పెడతాలే.. దగ్గరుండి నేనే తీసుకెడతా ఇంక నువ్వేం మాటాడకు' అంటూ మిత్రుడి నోరు మూయించాడు భజగోవిందం.


'ఇంటర్వ్యూకోసం వీడి ఇంటిలో దిగి తప్పు చేస్తున్నానా?' మనసేదో కీడు శంకించింది ముకుందానికి.

స్నానం చేసొచ్చి పూజకోసం పూలు కోయడానికి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెడుతున్న భజగోవిందాన్ని అటుగా పరుగెత్తుకు వెచుతూ దభేల్మని డాష్ ఇచ్చి కింద పడింది కూతురు మాలక్ష్మి.

'అబ్బబ్బ... ఇల్లంతా ఒకటే పరుగులు... అరుపులు..అబ్బబ్బ. వెధవ పిల్లలు.. ప్రశాంతంగా ఉండనివ్వరు. పూజ కూడా చేసుకోనివ్వరు ' అంటూ పిల్లదాన్ని వెంబడించాడు.

'చూశావా... ముకుందం సంసార సాగరాన్ని ఈదటం ఎంత కష్టమో, నీకు కూడా పెళ్లయితే కానీ ఈ బాధలు తెలిసిరావు..'. అంటూ పూల బుట్ట పట్టుకుని గార్డెన్‌లోకి వెళ్లిపోయాడు.

భోజనాల దగ్గర భార్యకి ఆదేశాలు జారీ చేశాడు. ముకుందం అని చెప్తుంటానే... నా చిన్న నాటి మిత్రుడు... ఇంటర్వ్యూకోసం వచ్చాడు. రేపు ఎనిమిదిన్నరకల్లా మేం భోజనాలు చేసి బయలుదేరాలి. అంటే నువు ఏడింటికల్లా వంట సిద్ధం చేయాలి. ఆదేశాలు జారీ చేశాడు..ఒళ్లు దగ్గర పెట్టుకుని వంట చెయ్యి.. రేపు బంగాళా దుంపలు వండు. దొడ్లోంచి తోటకూర ఓ రెండు పచ్చిమిర్చి తెంపుకొచ్చి పులుసు అఘోరించు... కొత్తిమీర చెట్నీ చెయ్యి. ఉంది



కదాని మొక్కలన్నీ పీకి తగలెట్టకు... ఆకులు మాత్రంకోసి పచ్చడి చెయ్యి అంటూ తగినన్ని సూచనలు, జాగ్రత్తలు జారీ చేశాడు.

'అమ్మో! వీణ్ణి భరించడం కొంచెం కష్టమే... 'మనసు పొరల్లో ఎక్కడో చిన్న అనుమానం మొలకెత్తింది. 'ఎరక్కపోయి వీడింటికి వచ్చి తప్పు చేశానా? 'తొలి సారిగా సందేహం కలిగింది ముకుందానికి.

ముకుందం.. నువు రెస్ట్ తీసుకో.. నేను ఆఫీసుకి వెళ్లొస్తా అని భజగోవిందం బయలుదేరాడు. పెద్ద తుఫాను వెలిసినట్లయింది ఇంట్లో..

** ** **

'ఏరా వెధవా! వేలెడంత లేవు నీకు క్రికెట్టా! ఎండల్లో ఏంటా ఆటలు? వడదెబ్బ తగిలి పడ్డావంటే వదులుతాయి వందలు.. వందలు .. కాలో ,చెయ్యో విరిగిందంటే మళ్లీ అదో ఖర్చు .. వేసవి శెలవులు ఎపుడవుతాయోగానీ చంపుకు తింటున్నారు వెధవ పిల్లలు... అంటూ సుడిగాలిలా అడుగుపెట్టిన భజ గోవిందం కింద చూసుకోకుండా అక్కడే ఉన్న కుంకుడు గింజలు, చింత పిక్కల మీద కాలు వేసి దభేలున పడ్డాడు. అసలే ఎండలో వచ్చాడేమో.. ఆవేశంతో రెచ్చిపోయాడు.

'దీనికింకో పనిలేదు! కుంకుడు గింజలు, చింతపిక్కలు, పుల్లముక్కలు, గులక రాళ్లు.... వీటితో ఆటలు.. స్కూళ్లు ఎపుడు తెరుస్తారో గానీ .. అంటూ భార్యమీద ఇంతెత్తున లేచాడు. నీకైనా బుద్ధుండక్కర్లా? నడిచే దారిలో ఏంటా ఆటలు? నడ్డి విరిగితే ఏమయ్యేది అంటూ పెద్ద పెద్దగా హూంకరిస్తుండటంతో ముకుందానికి మెలకువ వచ్చేసింది. ఆ శాపనార్థాలన్నింటినీ మౌనంగా భరించి బియ్యం ఏరుతున్న చాటతో వంటిట్లోకి నిష్క్రమించింది భజగోవిందం భార్య.

'ఆ! లేచావా? నీకోసమే చూస్తున్నా .. ఇదిగో జి.కె. బుక్.. లైబ్రరీ నుంచి తెచ్చాను. చదువుకో. ఇంటర్వ్యూలో ఏమైనా అడుగుతారేమో అంటూ పుస్తకం అందించాడు. నా ఇంటర్వ్యూమీద నాకే లేని శ్రద్ధ భజగోవిందానికెందుకబ్బా? ఏంటో విచిత్రమైన వ్యక్తి' అనుకున్నాడు ముకుందం.


సాయంత్రం కావస్తుండటంతో కాసేపు బయటకి వెళ్లొద్దాం అని తయారవుతున్న ముకుందాన్ని గమనించిన భజగోవిందం తనూ వస్తానన్నాడు.

' నడు.. అలా సరదాగా నాలుగడుగులు వేసొద్దాం. నీకు కాస్త రిలీఫ్‌గా ఉంటుంది అంటూ తయారయ్యాడు..

'ఓరి భగవంతుడా! బయటకు కూడా తయారయ్యాడా! ' అనుకుంటూ నీరసంగానే బయలుదేరాడు ముకుందం.

'ముకుందం ఈ దగ్గరలో ఒక గుడి ఉంది. అక్కడిదాకా వెళ్లొద్దాం. చెప్పులు వేసుకోకు. అక్కడ దొంగ వెధవలుంటారు.' అంటూ కాలినడకన మైళ్లకొద్దీ నడిపించేశాడు. దారంతా తన వివాహం, ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలతో ఊదరగొట్టేశాడు. కుటుంబమనేది ఆర్థిక సూత్రంపైనే ఆధారపడి ఉందంటాడు భజగోవిందం. ఇంట్లో ప్రతీది లెక్క చూసుకు నడుపుతుంటే నష్టమే ఉండదని దేశంలో కుటుంబాలన్నీ ఇదే పద్ధతిన జీవనం వెళ్లదీస్తే ప్రపంచ ఆర్థిక పటంలో అమెరికా తర్వాత అంతటిదేశం మనదే అవుతుందని తనకున్న జ్ఞానంతో తేల్చి చెప్పాడు. సంపన్నులు చేస్తున్న దుబారాతో మరో దేశాన్ని పోషించచ్చన్నాడు. ధరలు పెరగడానికి కారణాలు వివరించాడు. ఇంట్లో నలుగురు అతిధులు వస్తే ఎంత మొత్తంలో బియ్యం పడతాయో, ఎంత పొదుపుగా వంట చేయవచ్చో ఇలా వంటింటి వివరాలన్నీ పూస గుచ్చినట్లు చెప్పాడు. ప్రతీ మగవాడు వంటిల్లనే మహాసామ్రాజ్యంపై కన్నేసిఉంచాలని హితబోధచేశాడు. దొంగ వస్తువుల అక్రమ రవాణా తరహాలో ఉప్పులు, పప్పులు పక్క ఇళ్లకి అప్పుకింద సరఫరా అయ్యే ప్రమాదం లేకపోలేదన్నాడు. పెళ్లాన్ని అదుపులో పెట్టకపోతే ఆ మగవాని జీవితం ఇక అధోగతే అన్నాడు. కారణం ఉన్నా లేకపోయినా రోజుకు రెండు మూడు సార్లైనా తిడుతూ ఉండాలన్నాడు. అలా ముందస్తుగా తిట్టడం వల్ల భార్య అదుపులో ఉంటుందని తద్వారా తన గౌరవం, సంసారంపై పట్టు నిలబడతాయని చెప్పుకొచ్చాడు. వంటింట్లో ఎంత ఎత్తున వేస్టేజ్ అవుతోందో అదును చూసి కనిపెట్టి రెడ్ హాండెడ్‌గా పట్టుకోవాలన్నాడు. ఫలితంగా కుటుంబ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందన్నాడు.

'అసలివేంటి... ముకుందం నువు పెళ్లి చేసుకోవాలే గానీ సంసార సాగరాన్ని ఈదడంలో మెలకువలు నేర్పుతా'నన్నాడు భజగోవిందం. భజగోవిందానికి నోరు నొప్పెట్టిందో లేదో కానీ విన్న ముకుందానికి మాత్రం శిరోభారం మొదలైంది. ఇంటర్వ్యూలో సెలక్ట్ కావాలని మొక్కుకుని ప్రదక్షిణాలు చేయి ముకుందం అని సలహా ఇచ్చాడు. చేసేది లేక మౌనంగానే మిత్రుని ఆజ్ఞని శిరసా వహించాడు ముకుందం.




> **'అమ్మో! వీణ్ణి భరించడం కొంచెం కష్టమే... 'మనసు పొరల్లో ఎక్కడో చిన్న అనుమానం మొలకెత్తింది. 'ఎరక్కపోయి వీడింటికి వచ్చి తప్పు చేశానా? 'తొలి సారిగా సందేహం కలిగింది ముకుందానికి.**



'భగవాన్. నాకేదో అయిపోతోంది. రేపీపాటికి ట్రైన్ ఎక్కేయ గలిగితే స్వేచ్ఛా వాతావరణంలో పడొచ్చు. ఈ ఒక్క రాత్రి కాళరాత్రి కాకుండా చూడు భగవాన్ 'మనసులోనే అనుకుని ఇంటికి బయలుదేరాడు. స్వతహాగా మెతకదనం, సర్దుకుపోయే గుణం కల ముకుందానికి భజగోవిందం ఇస్తున్న ట్రీట్‌మెంట్ చెమటలు పట్టిస్తోంది. ఇంటర్వ్యూ అయ్యాక ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండకూడదు స్థిరంగా అనుకున్నాడు మనసులో.

** ** **

తెల్లారి అయిదింటికే మొదలైంది భజగోవిందం సుప్రభాతం. లెండి... లెండిహ.... చాల్చాలు పడకలు.. అంటూ ఆదమరచి నిద్రపోతున్న పిల్లల వీపు మీద చరిచాడు. వీళ్లిలా లేవరు.. అంటూ కప్పుకున్న దుప్పట్లు, పక్క బట్టలు లాగేయడంతో నిద్రకళ్లమీదే లేచి కూర్చున్నారు వాళ్లు.. పెద్దపెద్ద అంగలేసుకుంటూ గార్డెన్లో పూలకోసం వెడుతున్న భజగోవిందం ముకుందం లేవాలింక... త్వరగా తెములు అంటూ మంత్రాలు చదువుకుంటూ వెళ్లిపోయాడు.

ఆదరాబాదరాగా తెమిలి భోజనాలు ముగించాక నడు ... నడు... అంటూ కంగారు పెట్టాడు ముకుందాన్ని.

దారిలో పెట్రోల్ బంక్ కనపడటంతో ఆగిపోయాడు.. గోవిందం! ఎంటాలస్యం?

' ఏంలేదు.. పెట్రోల్ వేయిద్దామని.. అని రెండు నిమిషాలాలోచించి వద్దులే ఇక్కడయితే దోచేస్తారు.. ఆ పక్కవీధిలో మరో బంకుంది. అక్కడయితే కొలత, రేటు రెండూ సమంగా ఉంటాయి ' అంటూ మళ్లీ బండిపోనిచ్చాడు. అక్కడ చిల్లర లెక్క చూసుకున్నాక ఇక హైవే మీద పరుగులు పెట్టించాడు బండిని. ధరల పెరుగుదల, సంకీర్ణ ప్రభుత్వాల పతనానికి కారణం, హంగ్ పార్లమెంటు తదితర అంశాలపై తనకున్న జ్ఞానాన్నంతటినీ ముకుందం మెదడులో గుమ్మరించాడు. గల్ఫ్ యుద్ధం నాటికీ నేటికీ పెట్రోల్ రేటు ఎలా పెరిగిందో చెప్పు కొచ్చాడు. అసలు బండిని రిపేర్లు లేకుండా ఎలా నడపాలి అన్న అంశంమీద అనర్గళమైన ఉపన్యామిచ్చాడు. బండివేగం, గాలిహోరులో కొన్ని, కొన్ని విషయాలు సరిగా వినపడకపోయినా ముకుందానికి కడుపులో తెమిలినట్టైంది. ఇంటర్వ్యూ స్పాట్‌కు వెళ్లే లోగా నా మెదడుకేంకాదుగా? తనమీద తనకే సందే హం వచ్చింది. చిన్ననాటి మిత్రుడి నైజం తెలిసికూడా వీడింటికి రావడం ఖచ్చితంగా రాంగ్ ఛాయిస్సే డౌటులేదు.. అనుకున్నాడు మనసులో.

సరిగ్గా నాలుగు మలుపులు తిరిగాక ఠపీమని ఆగి కూర్చుంది స్కూటరు. అప్పటికి టైము 9.30 .

'చిన్నపాటి రిపేరేలే.. పది నిమిషాల్లో చేసేస్తా... ఈ బండిని కాస్త వంచి పట్టుకో ' అంటూ రోడ్డు వారగా బండి నాపి సాష్టాంగపడి బండికింద రిపేరు మొదలెట్టాడు భజగోవిందం.

'గోవిందం మనకిక టైం లేదు.. ఇపుడు నువ్వు రిపేర్ మొదలెడితే...' సణగబోయాడు ముకుందం.

'ఏం పర్వాలేదు..అయిపోతుంది '

'అదికాదు గోవిందం అదిగో అక్కడ మెకానిక్ షాప్ కనిపిస్తోంది. అక్కడికి తీసుకెళ్దాం' సర్దిచెప్పబోయాడు.

'అదే నీకు నాకు తేడా. ఇంత చిన్న రిపేరుకి అక్కడికి వెడితే వదులుతుందో వంద కాయితం. అసలు నీలాంటి వాళ్లే దేశానికి భారం. దేవుడిచ్చిన బుర్రని వినియోగించుకోవాలి' అంటూ రెంచి పట్టుకుని రిపేరులో మునిగిపోయాడు.

ఓపక్క టైం అయిపోతోంది. ముకుందానికి కాళ్లలోంచి వణుకు ఆరంభమైంది.

'ఒరే!గోవిందం నువ్వీ బండిని రిపేర్ చేయించుకుని ఇంటికెళ్లిపో..నేను ఆటోలో వెళ్లి ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని వస్తా ' బెరుకు బెరుకుగా చెప్పాడు ముకుందం.

'ఆ ఎందుకూ? శుభమాని ఇంటర్వ్యూకి వెడుతుండగా ఒక్కడివీ ఎలా వెడతావు? పైగా ఆటోవాళ్లు చూశావుగా

వెడతావు? పైగా ఆటోవాళ్లు చూశావుగా ఎంలాంటి గడుసుమొహాలో.. ఈ పక్క వీధిలోనే నా ఫ్రెండ్ ఉన్నాడు. ఈ బండి అక్కడ పెట్టేసి మనం ఆటోలో వెడదాం. కాస్త ఆ ఇంటిదాకా తొయ్యి' అన్నాడు భజగోవిందం. చేసేదేం లేక మౌనంగానే గుడ్లనీరు కక్కుకుని ఆ పనికూడా చేశాడు ముకుందం.

ఇక మిగిలిన టైం అరగంట మాత్రమే. ఏదో ఒక ఆటో పట్టుకుని వెళ్లిపోవాల్సిందే ఖండితంగా అనుకున్నాడు మనసులో. భజగోవిందం చాదస్తానికి ఆరేడు ఆటోలు బేరాలు కుదరక వెళ్లిపోయాయి . చచ్చీ చెడీ ఒక ఆటో కనపడటంతో మీటరు మీద అయిదురూపాయలు అదనంగా చెల్లించడానికి ఒప్పుకుని గోవిందం రియాక్షన్‌ని కూడా చూడకుండా ఆటో ఎక్కేశాడు ముకుందం.

విన్న ముకుందానికి నరాలన్నీ చచ్చుబడిపోయాయి. నీరసం, నిస్సత్తువ ఆవహించింది. నిన్నటినుంచి మిత్రుడు ఇస్తున్న మెంటల్ టార్చర్‌కి ఇదో కొసమెరుపన్న మాట.. అనుకున్నాడు. దారిలో మిత్రుడి ఇంటిలో పెట్టిన బండిని తీసుకుని రిపేరు చేయించి కాళ్లీడ్చుకుంటూ ఇంటికొచ్చారిద్దరూ..

'ఇంటర్వ్యూ టైంకి చేరగలనా? లేటయితే.. ఇంట ర్వ్యూలో ఏం అడుగుతారో??' ఇలా సవాలక్ష ఆలోచనలు ముకుందం మెదడుని తొలిచేస్తున్నాయి.

'ముకుందం చూడు.. చూడు... అంతా తప్పుడు మీటర్లే.. కొంచెం దూరం కూడా వెళ్లకుండానే మీటర్ చూడు దభేల్ దభేల్... మని ఎలా పడిపోతోందో? 'అంటూ మీటరు వంకే చూస్తున్న భజగోవిందాన్ని పీక నొక్కి చంపేయాలన్నంత కోపం వచ్చింది ముకుందానికి. అయినా తమాయించుకున్నాడు. సమయం పది అయిదు... మధ్యలో ట్రాఫిక్ జాంతో మరో పావుగంట లేటయింది.

ఇంటర్వ్యూ కార్యాలయానికి చేరగానే చిల్లరకోసం కూడా చూడకుండా వందనోటు ఆటోవాడి జేబులో కూరి పరుగు పరుగున రిసెప్షన్ కౌంటర్‌కు చేరుకున్నాడుముకుందం.


'అరగంట ఆలస్యంగా వచ్చారు. కాండిడేట్లని ఇందాకే లోపలికి పిలిచేశారు. ఇక ఎవరినీ ఎలౌ చేయద్దన్నారు పెదవి విరిచింది రిసెప్షనిస్టు.

' ట్రాఫిక్ జాం... కొత్త ప్రదేశం.. రూటు సరిగా తెలీక...' అని నసుగుతూ సర్ది చెప్పబోతున్న ముకుందాన్ని పక్కకి లాగి రంగంలోకి దిగాడు భజగోవిందం. 'ట్రాఫిక్ జాం అయితే అది మా తప్పెలాగ అవుతుంది? దీనికి వెనుక సవాలక్ష కారణాలున్నాయి. జనాభా పెరుగుదల లాంటి సామాజిక సమస్యలని దృష్టిలో పెట్టుకుని స్పందించాలి మీరు... కళ్లెగరేసి మాట్లాడాడు భజ గోవిందం. ఎంత వాదించినా ఉపయోగం లేకపోవడంతో వెనుదిరిగాడు ముకుందం.

'ఒరే! ముకుందం.. వీళ్లనిలా వదలద్దు.. ఏ రూల్‌ప్రకారం అనుమతించరో నేనూ చూస్తాను. మనం చేయని తప్పుకి మనమెందుకు బలవ్వాలి? ఆలస్యానికి కారణం వివరిస్తూ కోర్టులో పిటిషన్ వేయి మనమేం కావాలని లేట్ చేయలేదుగా. సామాజిక సమస్యలని ఉటం కిస్తూ ఆ ప్రభావం మనిషి దైనందిన జీవితం మీద ఎలా దెబ్బతీస్తున్నాయో వివరిస్తూ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ వేస్తే ఛస్తారు వెధవలు.. లాక్కోలేక... పీక్కోలేక.. 'అంటూ ఉచిత సలహా ఒకటి పారేశాడు.

విన్న ముకుందానికి నరాలన్నీ చచ్చుబడిపోయాయి. నీరసం, నిస్సత్తువ ఆవహించింది. నిన్నటినుంచి మిత్రుడు ఇస్తున్న మెంటల్ టార్చర్‌కి ఇదో కొసమెరుపన్న మాట.. అనుకున్నాడు. దారిలో మిత్రుడి ఇంటిలో పెట్టిన బండిని తీసుకుని రిపేరు చేయించి కాళ్లీడ్చుకుంటూ ఇంటికొచ్చారిద్దరూ.. ముకుందానికి భజగోవిందాన్ని చంపి పారేయాలన్నంత కోపం ఉంది. పెట్టే బేడా సర్దుకుని ఇంటికి బయలుదేరాడు.

'ఆగారా ముకుందం! బస్టాండు వరకూ దింపుతా ఎండలో ఏం వెడతావ్? అంటూ రాబోయిన భజగోవిందానికి చేతులెత్తి దండంపెట్టి- 'గోవిందం.. నేన్నిన్నెపుడూ ఏమీ అడగలేదు..ఇప్పుడడుగుతున్నా... బస్టాండుకైనా నన్నొక్కణ్ణీ వెళ్లనీ.. ప్లీజ్ 'అని అటే వెడుతున్న ఆటోలో ఎక్కి బతుకు జీవుడా అనుకుంటూ బయలుదేరాడు ముకుందం. పాపం.. ముకుందం. ●




## స్వగతం

### ఆదరాభిమానాలకు కళ్ళ వెంబడి నీళ్ళు వచ్చాయి


కనకారావు

**మా** నాన్నగారికి మూడవ సంతానమైన నేను పై చదువులకు హైదరాబాద్ వెళ్ళాను. పట్టణ వాతావరణం బాగా అలవాటై సౌకర్యాల లేమితో పల్లెల్లో వుండే వారి పట్ల నాలో చులకన భావం ఏర్పడింది. దానికి తోడు నాకున్న మిత్రులు కూడా ఢిల్లీ, ముంబాయి వంటి మహానగరాలకు చెందిన వారవడంతో మా ఊరు గుర్తొచ్చేది కాదు. డిగ్రీ పూర్తి చేసి మా ఊరికి వచ్చిన నాకు, మరో ప్రాణ స్నేహితుడు నాగేందర్‌కు మధ్య ఎప్పుడూ పట్నం గొప్పదా... పల్లె గొప్పదా... అనే అంశంపై వాదోపవాదాలు జరిగేవి. పల్లెల్లో వున్న మజా పట్నంలో లేదనేది వాడి అభిప్రాయం. ఒకనాడు మా మరదలు కనకలక్ష్మిని చూద్దామని మావయ్యగారి ఊరైన ముప్పనపల్లికి బయలుదేరాను. తోడుగా నా మిత్రుడు నాగేందర్‌ని కూడా తీసుకుని హీరోహోండాపై బయలు దేరాను. ఇక ఒక్క గ్రామాన్ని దాటగానే మావయ్య ఊరు వస్తుందనగా, అకస్మాత్తుగా రోడ్డు మీదకు ఎలుగుబంటి రావడంతో వెంటనే బండిని పక్కకు మళ్ళించి చెట్టుకు గుద్దాల్సి వచ్చింది. ఇద్దరం ఎగిరి పడ్డాం. అయితే చిన్న చిన్న దెబ్బలే తాకడంతో మా అదృష్టమనుకున్నాం. కానీ, బెదిరిన ఎలుగుబంటి మా వెంట పడటంతో, లేచే ఓపిక లేకపోయినా దెబ్బలను సైతం మరిచిపోయి శక్తిమేరా ఫరుగులు తీసాం. కానీ, మాకంటే వేగంగా వచ్చిన ఎలుగుబంటి మా మీదకు దూకింది. దాంతో పైప్రాణాలు పైనే పోయాయి. దాని పంజా దెబ్బలకు చనిపోతామేమో అనుకుంటున్న తరుణంలో ఎప్పుడు వచ్చారో తెలియదు కానీ, పదిమంది గ్రామస్తులు ఎలుగును చుట్టుముట్టి అదిలించబోయారు. కోపంతో వున్న ఎలుగు ఇద్దర్ని తీవ్రంగా గాయపరచి మరీ పారిపోయింది. ఎలుగు బంటి అప్పుడే ప్రసవించిందని, ఆ సమయంలో సింహానికన్న క్రూరంగా మారిపోతుందని గ్రామస్తుల మాటల వల్ల తెలిసింది. గాయపడిన వారితో పాటుగా మమ్మల్ని కూడా గ్రామంలోకి తీసుకుపోయి ఆకుపసర్లతో కట్లు కట్టారు. ఆప్యాయంగా వారు పలకరించిన తీరు, అన్నం ముద్దలుగా కలిపి నోటికి అందించడం నన్ను కట్టిపడేసాయి. వారి ఆదరాభిమానాలకు కళ్ళ వెంబడి నీళ్ళు తిరుగుతుంటే నా మిత్రుడి కళ్ళల్లో 'ఓడిపోయావు చూసావా..!' అనే చూపు కనపడి తలదించుకున్నాను. ఆ గ్రామస్తులు ప్రాణాలకు తెగించి మమ్మల్ని కాపాడకపోతే మేము ఈ పాటికి ఎక్కడుండే వాళ్ళమో తలచుకుంటే ఇప్పటికీ నా ఒళ్ళు జలదరిస్తుంది.

– శిద్దంశెట్టి కనకారావు, మంగపేట, వరంగల్ జిల్లా

### మరిచిపోలేని అపూర్వ సంఘటన


ప్రశాంతకుమారి

**నే**ను పదవ తరగతి చదువుతున్న రోజులవి. గుడివాడ ఓల్డ్ టౌన్ హైస్కూల్లో పరీక్షలు రాయటానికెళ్ళాను. నాతో మా అక్కకూడా వచ్చింది. పరీక్షకు ఇంకా టైం ఉంది. స్కూల్లో క్లాసులు జరుగుతున్నాయి. పరీక్షకు వచ్చిన వారంతా గ్రూపులు,గ్రూపులుగా నిల్చుని మాట్లాడుకుంటున్నారు. నేను, అక్క కూడా ఓ పక్కన నుంచున్నాం. ఇంతలో ఇద్దరు చిన్నపాపలు గులాబీ పువ్వులు తీసుకొని వెళ్తున్నారు. అందరూ ఆ పిల్లలవైపే చూస్తున్నారు. నేనూ చూసాను. ఆ ఇద్దరిలో ఓ పాప నావైపే చూస్తూ నవ్వుతూ ముందుకు వచ్చి నాకు గులాబీ ఇస్తూ అక్కా తీసుకో అంది. అది చూసి మాట్లాడుకునే వారందరు మాటలు ఆపేసి అదే పనిగా నన్నే చూస్తూ ఉండిపోయారు. అంతమందిలో నాకే ఇచ్చిన ఆ పాపకు బై చెబుతూ ఆనందంతో నుంచుండిపోయాను. ఆనాటి అపూర్వ సంఘటనను, ఆపాపను నా జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేను.

– జి.ప్రశాంతకుమారి, మందపాడు, గుడివాడ

### ఆ తల్లి కళ్ళల్లో అపూర్వమైన కాంతి


విజయ్‌కుమార్

**నే**ను సంగారెడ్డిలో తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు నా వయసు పద్నాలుగేళ్ళు. నేను చదివేస్కూల్ ఇంటికి కొద్ది దూరంలో ఉండేది.ఒక రోజు మధ్యాహ్నం భోజనం చేయడానికి వెళుతుండగా ఒక మూడేళ్ల పాప దారి తప్పి ఇంటికి వెళ్ళడం తెలియక ఏడుస్తూ ఉంది. అప్పుడు ఆ అమ్మాయిని ఎత్తుకుని అక్కడ కాలనీ మొత్తం తిరిగి ఆ అమ్మాయిని వాళ్ళింట్లో అప్పగించాను. అప్పటికే వాళ్ల అమ్మ పాప కోసం చుట్టు పక్కల వెతుకుతోంది. ఆ అమ్మాయిని నేను తీసుకొని వెళ్ళగానే పాపను చూసిన ఆమె కళ్ళల్లో అపూర్వమైన కాంతివచ్చింది. ఆమె సంతోషంతో నన్ను మెచ్చుకుంది. ఆ రోజు మధ్యాహ్నం నేను భోజనం చేయలేదు. ఆనాటి సంఘటన ఇప్పటికీ అప్పుడప్పుడు గుర్తొస్తుంది.

-ఆర్. విజయ్‌కుమార్, బాబానగర్, మెదక్ జిల్లా